క్లుప్తంగా

ప్రభుత్వస్థలం చదును చేసిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు



ప్రభుత్వ స్థలాన్ని పొక్లెయిన్‌తో చదును చేయిస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పరిధి పరదేశి పాలెం కాపులుప్పాడ రెవెన్యూ సర్వే నెంబర్ 64లో సుమారు 4 కోట్లు విలువ చేసే 60 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించిన విషయం తెలిసిందే. ఆ ప్రభుత్వ స్థలాన్ని అనధికారికంగా పొక్లెయిన్ ద్వారా చదును చేయించాడు. ప్రభుత్వ స్థలంలో వాహనాన్ని పెట్టి చదును చేయించిన క్రమంలో ఆ వాహనదారుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆర్డీవో సంగీత్ మాథూర్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా మట్టిని తవ్వడం, చదును చేయడం వంటివి నిర్వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే ఈ స్థలాన్ని మొత్తం సర్వే చేశామని, ఆక్రమించిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

భీమునిపట్నం: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష పాలిసెట్‌కు భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 28 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణతో పాటు పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామని తెలియజేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించినవారు, ఈ ఏడాది పరీక్షలు రాసినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు కళాశాలకు హాజరు కావాలని కోరారు.

ప్రమాదకరంగా నిఘా నేత్రం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం కూడలి వద్ద సీసీ కెమెరా స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇటీవల వేకువ జామున ఓ పొక్లెయిన్ ఈ స్తంభాన్ని ఢీ కొట్టిన క్రమంలో నేల కొరిగింది. వెంటనే అధికారులు దానికి మరమ్మతులు చేసి తిరిగి ఏర్పాటు చేశారు. అయితే నెల తిరగకుండానే గుర్తు తెలియని వాహనం ఈ స్తంభాన్ని బలంగా ఢీ కొనడంతో ఓ వైపుగా ఒరిగిపోయి, పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న సీసీ కెమెరా స్తంభం

సెల్‌టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌ను ఆనుకుని ఉన్న యాతపేటలో సెల్‌టవర్ నిర్మాణ పనులను స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు. సెల్‌టవర్ నిర్మాణం వలన రేడియేషన్‌తో ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, రీసు చిన్నారావు, రీసు రమణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులతోనే నిర్మాణం

భీమునిపట్నం: ప్రభుత్వం అందించిన అన్ని అనుమతులతోనే తాము నిర్మాణాలు చేపడుతున్నామని భీమిలి సమీపంలోని కుమ్మరిపాలెం వలందభూముల వద్ద సర్వే నంబర్ 13లో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపడుతున్న స్థల యజమాని బలభద్రుని చెన్నయ్యశెట్టి తెలిపారు. భీమిలిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము నిర్మాణం చేపడుతున్న స్థలంలో గ్రామకంఠం భూమి కొంత ఉందని, దాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నామని కొందరు తమపై అధికారులకు ఫిర్యాదు చేశారని, కానీ అది వాస్తవం కాదన్నారు. ఇందులో ఎలాంటి ప్రభుత్వ భూమి లేదని, సంబంధిత పత్రాలను అధికారులకు అందించామని, అన్నీ సక్రమంగా ఉన్నట్లు వారు గుర్తించారని తెలిపారు. తమను అనవసరంగా ఇబ్బంది పెడుతూ, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై అధికారులు చర్యలను తీసుకోవాలని కోరారు.

బాస్కెట్‌బాల్‌లో మెరుపులు



మెరుపువేగంతో ఆడే క్రీడ బాస్కెట్ బాల్. సెల్‌ఫోన్లలో బందీ అవుతున్న పిల్లల్లో చురుకుదనాన్ని పెంపొందించే ఈ క్రీడపై దృష్టి సారిస్తున్నారు తల్లిదండ్రులు. రోజంతా తరగతి గదికే **పరిమితమవుతున్న** పిల్లలు కూడా ఈ **ఔట్‌డోర్ గేమ్** అంటే ఆసక్తి కనబరుస్తున్నారు. **క్రమం** తప్పని ప్రాక్టీస్..చక్కని శిక్షణతో పతకాలు సొంతం చేసుకుంటున్నారు సాగర్‌నగర్ బాస్కెట్‌బాల్ అకాడమీ క్రీడాకారులు. జాతీయస్థాయిలో రాణించాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణింపు

ఎస్ఎస్‌బీఏ శిక్షణలో ప్రతిభకు పదును

రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సొంతం

కొమ్మాది: మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయి. నేటి పిల్లలు సెల్‌ఫోన్లకు బందీలవుతూ ఔట్‌డోర్ గేమ్స్ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి. స్కూల్ నుంచి వచ్చిన వెంటనే పుస్తకాల బ్యాగ్‌ను మూలకు గిరాటేసి ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్ రీల్స్, వీడియో గేమ్స్‌తో కాలం గడిపేస్తున్నారు. దీంతో అలసత్వం, మతిమరుపు, కంటి సమస్యలు పెరుగుతున్నాయి. దీన్ని గుర్తించిన పలువురు తల్లిదండ్రులు ఆ బందిఖానా నుంచి తమ పిల్లల్ని బయట పడేసేందుకు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. సాగర్‌నగర్ బాస్కెట్ బాల్ అకాడమీ (ఎస్ఎస్‌బీఏ)లో శిక్షణ పొందుతున్న పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు చదువుతో పాటు బాస్కెట్ బాల్‌లోనూ సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు.



ప్రతిభతో పతకాలు

ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు చోట్ల నిర్వహించిన పోటీల్లో ఇక్కడి క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సొంతం చేసుకున్నారు. చదువుతోపాటు, క్రీడల్లోనూ రాణిస్తున్నారు. తమ పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి కనబరిచాక.. చదువులోనూ చురుగ్గా ఉంటున్నారని తల్లిదండ్రులు ఆనందంగా చెప్తున్నారు.



బాస్కెట్ బాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వేసవిలో ఉచిత శిబిరాలు

సాగర్‌నగర్ బాస్కెట్ బాల్ అకాడమీలో కోచ్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో చాలామంది పిల్లలు శిక్షణ పొందుతున్నారు. ప్రతీ సంవత్సరం ఉచిత వేసవి శిబిరాలను నిర్వహిస్తూ పిల్లలకు క్రీడలపై ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఈ ఏడాది మే మొదటివారంలో శిబిరం ప్రారంభం కానుంది.

దేశం తరఫున ఆడాలి



బాస్కెట్ బాల్‌లో శిక్షణ పొంది, జాతీయ స్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ముందున్న లక్ష్యం. అందుకే ప్రతి రోజూ సాయంత్రం ఇక్కడ శిక్షణ పొందుతున్నాను. ఎప్పటికైనా బాస్కెట్ బాల్ పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించాలి.

– కె.జయరాం

జాతీయ స్థాయిలో రాణించాలని..



నేను ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నా. బాస్కెట్ బాల్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ఇటీవల అమలాపురంలో జరిగిన అండర్–14 పోటీల్లో కాంస్యం, పుదుచ్చేరిలో బీఎఫ్ఐ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు నా ఆశయం.

– ఆర్.భావనారెడ్డి, సాగర్‌నగర్

బ్రాంజ్ మెడల్ సాధించా



బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ పొందుతూ పోటీల్లో పాల్గొంటున్నాను. తెలంగాణ నేషనల్ సబ్ జూనియర్ అండర్–14 పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాను. ఇంకా పూర్తిస్థాయిలో శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలి. బాగా రాణించాలని ఆశ.

– హిమవర్షిణి, సాగర్‌నగర్

మరిన్ని పతకాలు సాధించాలి



ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అండర్–14 బాస్కెట్ బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాను. ఇంకా ప్రాక్టీస్ చేసి మరిన్ని పతకాలు సాధించాలి. ఏ స్థాయి పోటీలో అయినా పతకాన్ని తేవాలనేది నా కోరిక. మా కోచ్ సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో మెరుగైన శిక్షణ పొందుతున్నాను.

– కె.రితిల్

త్వరలో సమ్మర్ క్యాంప్



సాగర్‌నగర్ బాస్కెట్ బాల్ అకాడమీ ఆధ్వర్యంలో మే నెల మొదటి వారంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభించనున్నాం. రోజూ ఉదయం 6 నుంచి 8.30 వరకు, సాయంత్రం 6 నుంచి 8 వరకు శిక్షణ ఉంటుంది. పదేళ్ల వయసు దాటిన వారై ఉండాలి. ఇప్పటి వరకు మా అకాడమీలో 150 మంది శిక్షణ పొందారు. 15 మంది జాతీయ స్థాయిలో, 20 మంది రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు.

– బి.సునీల్ రెడ్డి, కోచ్, ఎస్ఎస్‌బీఏ

నాలుగు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం

తగరపువలస: విశాఖ నుంచి ఆనందపురం వైపు తరలిస్తున్న నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని భీమిలి క్రాస్‌రోడ్డు వద్ద ఆనందపురం పోలీసులు బుధవారం ఉదయం 5 గంటల సమయంలో పట్టుకున్నారు. బొలెరో వాహనంతో బియ్యం తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ పి.శివ క్రాస్‌రోడ్డు వద్ద మాటు వేశారు. బియ్యం తరలిస్తున్న కె.గోపాలకృష్ణ పోలీసులను చూసి కంగారు పడగా, వాహనాన్ని తనిఖీ చేశారు. నగరంలో రేషన్ బియ్యం కిలో రూ.8 నుంచి 12 వరకు కొనుగోలు చేసి ఆనందపురం పరిసర ప్రాంతాలలో రూ.20 వంతున విక్రయిస్తున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. సీఐ వాసునాయుడు వాహనంతో పాటు బియ్యాన్ని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారాంతపు సంత వేలం పాట రూ.1.25లక్షలకు ఖరారు



సచివాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న ఈవోఆర్డీ మీనా కుమారి

పద్మనాభం: పద్మనాభంలో ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు సంతలో ఆశీల వసూళ్లకు వేలం పాటను రూ.1.25లక్షలకు ఖరారు చేశారు. పద్మనాభం సచివాలయంలో ఈవోఆర్డీ మీనా కుమారి బుధవారం ఈ వేలం పాట నిర్వహించారు. వేలంలో నలుగురు పోటీ పడగా, వీరిలో పద్మనాభం గ్రామానికి చెందిన కంటుబోతు శ్రీను రూ.1.25లక్షలకు పాడుకున్నారు. దీన్ని అధికారులు ఖరారు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకుడు కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

మధురవాడ: ప్రధాని నరేంద్ర మోదీ పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. మూడోసారి ప్రధాన మంత్రి అయిన తర్వాత మతపరమైన అంశాలు ఉపయోగించుకుని ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే జిల్లా మహాసభల నేపథ్యంలో మధురవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పైడిరాజు మాట్లాడారు. ప్రభుత్వ పాలనలో మతం ఉపయోగించరాదని రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నా, వక్ఫ్ బోర్డు నూతన చట్టం తీసుకువచ్చి కలతలు సృష్టించి, వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న సీపీఐ మహాసభల విజయవంతానికి అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వాండ్రాసి సత్యనారాయణ, బి.కేశవయ్య, ఎం.ఎస్.పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

చెలరేగిపోతున్న చిల్లర దొంగలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు గొల్లవీధి, చిల్డ్రన్స్ పార్కు పరిసరాలలో కొంతకాలంగా చిల్లర దొంగలు చెలరేగిపోతున్నారు. చిల్డ్రన్స్ పార్కును ఆనుకుని విద్యుత్ స్తంభం వద్ద రాత్రి 12 గంటలు దాటిన తరువాత బాక్సు తెరచి వీధిదీపాలు ఆర్పేస్తున్నారు. తర్వాత స్థానికంగా నివాసం ఉంటున్న దివీస్ ఉద్యోగుల ఇళ్ల ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాల నుంచి పెట్రోల్, టైర్లు, ఇతర విడిభాగాలు దొంగిలిస్తున్నారు. దొంగతనాల అనంతరం వీధిదీపాలను యథావిధిగా వెలిగిస్తున్నారు. చిల్డ్రన్స్ పార్కు కేంద్రంగా కొందరు ఆకతాయిలు తెల్లవార్లు తిష్టవేసి చుట్టుపక్కల నివాసం ఉంటున్నవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. మద్యం, గంజాయి వంటివి సేవించి బాటిళ్లను ఇళ్లపై విసురుతున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత కేకలు వేస్తూ ఇళ్ల తలుపులు, గేట్లను బాదుతున్నారు. ఈ ప్రాంతంలో చీకటి పడిన తరువాత వీరి చేష్టలు ప్రారంభం కావడంతో మహిళలు ఒంటరిగా రాకపోకలు సాగించడానికి సాహసించడం లేదు. భీమిలి పోలీసులు స్పందించాలని, ఈ ప్రాంతంపై నిఘా ఉంచి ఆకతాయిల ఆట కట్టించాలని కోరుతున్నారు.



వీధిదీపాలు ఆర్పడానికి వినియోగిస్తున్న బాక్సు

అప్పలరాజు మాస్టారి సేవలు స్ఫూర్తిదాయకం

డీఈవో ప్రేమ్ కుమార్

విశాఖ విద్య: విద్యార్థుల మన్ననలు పొందేలా విధులు నిర్వహించిన ఆముదాల అప్పలరాజు తోటి ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ అన్నారు. బోయిపాలెం జెడ్పీ హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసి మార్చి 31న ఉద్యోగ విరమణ చేసిన అప్పలరాజుకు పాఠశాల నిర్వాహకులు బుధవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధురవాడలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన డీఈవో, అప్పలరాజు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను నైపుణ్యం గల క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో అప్పలరాజు పనితీరు ఆదర్శనీయమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తోటి ఉపాధ్యాయుల సర్వీసుపరమైన సమస్యల పరిష్కారంలోనూ అప్పలరాజు ముందు ఉన్నారని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. జిల్లా వ్యాప్తంగా హాజరైన వ్యాయామ ఉపాధ్యాయులు అప్పలరాజు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌రావు, పాఠశాల హెచ్ఎం కొండబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అప్పలరాజు దంపతులను సన్మానిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

రోడ్డు పనులకు శంకుస్థాపన

భీమునిపట్నం: భీమిలి సమీపంలో కొత్తగా నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. దొరతోట నుంచి కస్తుర్బాగాంధీ విద్యాలయం వరకు రూ 1.91కోట్లతో ఈ రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గంగసాని అగ్రహారం లే అవుట్‌కు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం, గంగసాని అగ్రహారం లే అవుట్‌లను ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గంగసాని అగ్రహారంలో లే అవుట్ అభివృద్ధికి భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ల్యాండ్ పూలింగ్ పథకం ద్వారా అభివృద్ధికి 245 ఎకరాల భూములు ఇచ్చిన రైతుల నిరీక్షణకు తెర పడిందన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ అత్యంత వేగంగా అగ్రశ్రేణి లే అవుట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్య నిర్వాహక ఇంజినీర్ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, కాకర్లపూడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'మానసిక ఎదుగుదలలో లోపమే ఆటిజం'

తగరపువలస: వయసుకు తగ్గట్టుగా పిల్లల్లో మానసిక ఎదుగుదల లేకపోతే ఆటిజం అంటారని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 70 కోట్ల మందిలో ఈ లక్షణాలు ఉన్నాయన్నారు. బుధవారం ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం, జాతీయ నడక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి రోజువారీ ఆహారంలో కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు, విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, జింక్, ఐరన్ వంటివి ఉండాలన్నారు. నడక ఆరోగ్యానికి వెన్నెముక అని, ప్రతి రోజూ కొంతసేపు నడవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నడక పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

వేములవలస మార్కెట్‌లో స్తంభించిన ట్రాఫిక్

పగలైనా, రాత్రయినా ఇదే సమస్య



వేములవలస మార్కెట్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస మార్కెట్ వద్ద పగలైనా, రాత్రయినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. మార్కెట్ మధ్య నుంచి ఆనందపురం వెళ్లే మార్గంలో తరచూ వాహనాలు నిలిచిపోవడం వివాదాలకు కారణమవుతోంది. బుధవారం సాయంత్రం కూడా మార్కెట్‌ను కారు దాటుతున్న సమయంలో ఇరువర్గాల మధ్య తగాదా జరిగింది. దీంతో స్వల్పంగా తోపులాట జరిగింది. మార్కెట్ లోపల నుంచి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కల్యాణ మండపం కూల్చేందుకు కుట్ర

స్థానికుల ఆగ్రహం

కొమ్మాది: కూటమి నాయకుల కన్ను స్థానిక కల్యాణమండపం స్థలంపై పడింది. దీంతో దీనిని కూల్చి, సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వివరాలివి.. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో 2007వ సంవత్సరంలో ఓ కల్యాణ మండపం నిర్మించారు. ఆ కల్యాణ మండపం చేపలుప్పాడ, పెద్ద ఉప్పాడ, చిన్న ఉప్పాడ, దిబ్బడపాలెం, కొత్తూరు, పాతూరు, చుక్కవానిపాలెం ప్రజలకు ఏ కార్యక్రమానికైనా వేదికగా ఉపయోగపడుతోంది. దానిని మరికొద్దిగా అభివృద్ధి చేసేందుకు స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో గత ప్రభుత్వం మరమ్మతుల నిమిత్తం రూ.49 లక్షల నిధులను విడుదల చేసింది. అయితే, ఎన్నికల నేపథ్యంలో పనులు ప్రారంభం కాలేదు. ఇదిలా ఉండగా బుధవారం చేపలుప్పాడలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇంతవరకు కథ బాగానే ఉంది. స్థానిక కూటమి నాయకుల కన్ను ఈ కల్యాణ మండపం స్థలంపై పడింది. దీంతో కల్యాణమండపం తొలగించాలని, దాని స్థానంలో ఆలయం కడతామంటూ కొత్త కథను తెరపైకి తీసుకువచ్చారు. దీనిపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాలకు ఉపయోగపడే కల్యాణ మండపాన్ని కూల్చి, ఆలయం నిర్మించడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఓ నాయకుడు ఆలయాల పేరుతో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాడు. ఇప్పుడు దేవుడి పేరుతో ఈ కల్యాణ మండపం కూల్చి ఆలయాలను నిర్మించి తమ సొంతం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కల్యాణ మండపం కూలిస్తే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని అన్ని గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.



చేపలుప్పాడలో కల్యాణ మండపం

చెదల కోటలు



ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బందలో చెదలు పెట్టిన పుట్టలు కోటలను తలపిస్తున్నాయి. తోటల మధ్య కొండవాలు ఎర్రటినేలలో ఒకదానిని మించిన మరో పుట్ట.. ఇలా వందల సంఖ్యలో చూడవచ్చు. గండిగుండం-అడవివరం మార్గంలోనూ చెదలు పెట్టిన కోటలు ఉన్నాయి. సాగు కారణంగా ఈ పుట్టలను కూల్చి చూసినా, ఇందులో అరలతో కూడిన నిర్మాణాలు కనిపించి ఆశ్చర్యానికి గురి చేస్తుంటాయి.

– తగరపువలస